భయంతో ఉన్నవాళ్లు ఏదీ సాధించలేరు
- రవీంద్రనాథ్ ఠాగూర్


# DD9 వార్త

తెలుగు దినపత్రిక

www.dd9vaartha.com | సంపుటి : 01 సంచిక : 147 | మంగళవారం, 13, 2026 , | పేజీలు - 06 | వెల : 3/-


## నగరంలో ఈ ఏడాది
# మొదటి వర్షం

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో చలి చంపే స్తుంది. గత కొన్ని రోజులుగా కనిష్ట ఉష్ణోగ్ర తలు నమోదవుతు న్నాయి. చలి తీవ్రతో ప్రజ లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద యం పూట రహదారులపై విజిబిలిటీ తగ్గిపో తోంది. చలి, పొగమంచు కారణంగా.. రోజు వారీ పనుల కోసమే ఉదయం బయటికి వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితులు మరికొన్ని రోజులు కొనసాగు తాయని.భారత వాతావరణ శాఖ అంచ నా వేసింది.అయితే జనవరి 14, బుధవారం నాడు హైదరాబాద్‌లో 2026 సంవత్సరంలో తొలిసారిగా వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు వెదర్ రిపోర్ట్ అందుతుంది. తెలంగాణ వెదర్ మ్యాన్. ఖచ్చితమైన వాతావరణ అంచనా లకు పేరుగాంచిన టి. బాలాజీ తన ఎక్స్ హ్యాండిలేటెస్ట్ అప్ డేట్స్ పంచుకున్నాడు.

## దివ్యాంగులకు మానవీయ
# కోణంలో సహకారం





**ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలనే నిర్ణయం**


**తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 15 శాతం కోత**

**'బాల భరోసా' పథకం, 'ప్రణామ్' డే కేర్ సెంటర్ల ప్రారంభంలో సిఎం రేవంత్**

**హైదరాబాద్,జనవరి 12 :** దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం అంది స్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో 'బాల భరోసా' పథకం, 'ప్రణామ్' డే కేర్ సెంటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలను ఉచితంగా పంపిణీ చేశారు. దాదాపు రూ. 50 కోట్లతో పరికరాలను అందించామని రేవంత్ తెలిపారు. ప్రభుత్వం మీ కోసం ఉందని చెప్పడానికే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వెల్లడించారు.ప్రణామ్ కార్యక్రమంతో వృద్ధులను ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఉద్యోగుల జీతాల్లో 10 నుంచి 15 శాతం కోత విధిస్తాం. ఈ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు తీసుకొస్తున్నాం. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసేవారిని మనమే దారిలోకి తీసుకురావాలి. కన్నవారి పట్ల బాధ్యత లేనివారికి సమాజంపై ఏం బాధ్యత ఉంటుందని రేవంత్ అన్నారు మిగతా2లో...

# పిజెఆర్‌కు సిఎం రేవంత్ ఘన నివాళి

**హైదరాబాద్,జనవరి 12:** దివంగత కాంగ్రెస్ నేత, మాజీమంత్రి పి. జనార్దన్ రెడ్డి జయంతి సందర్భంగా ఖైరతా బాద్ సర్కిల్ లోని ఆ మహనీయుడి విగ్రహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటిం చారు. పిజెఆర్ పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచన నేతగా కొనియాడారు. ఆయన ప్రజల కోసం నిరంతరంగా పాటుపడ్డారని అన్నారు. పేదల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిజెపి తనయ విజయా రెడ్డి,మంత్రి దామోర రాజనర్సింహ, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కూడా పాల్గొని పిజెఆర్‌కు నివాళి అర్పించారు.



## విద్యారంగంలో గేమ్ ఛేంజర్‌గా
# ఇంటిగ్రేటెడ్ స్కూల్స్



**వీటి నిర్వహణ బాధ్యత పూర్తిగా కలెక్టర్లదే**

**వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటి సిఎం భట్టి**

**హైదరాబాద్,జనవరి 12:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్ట్.. రాష్ట్ర విద్యా రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలుస్తోందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అన్నారు. ఈ ప్రాజెక్ట్‌పై ఉపముఖ్యమంత్రి మరోసారి తన నిబద్ధతను వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్లతో సోమవారం మిగతా2లో...

## పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై
# సుప్రీం విచారణ

**● విచారణకు హాజరైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ● మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలు పరిష్కరించుకోవాలి ● తెలంగాణకు సుప్రీం ధార్మసనం సూచన**

**● కేటాయింపులకు మించి వాడరాదన్నదే మా అభ్యంతరం: ఉత్తమ్**



**న్యూఢిల్లీ,జనవరి 12 :** పోలవరం – నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణకు వచ్చింది.. ఈ విచారణకు తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంలో తెలంగాణ సర్కార్ రిట్ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సీజేఐ ధర్మాసనం సూచించింది. మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలను పరిష్క రించుకోవాలని కూడా మార్గనిర్దేశంచేసింది. కేంద్రం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ వద్ద తెలంగాణ వాదనలు మిగతా2లో...

## ప్రభుత్వ ఉద్యోగులకు
# సంక్రాంతి కానుక

**డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్,జనవరి 12:** సంక్రాంతి వేళ ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ సర్కార్ శుభవార్త చెప్పింది. డీఏను 3.64 శాతం పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన డీఏ 2024 జులై 1 నుంచి వర్తించనుంది. జనవరి నెల వేతనంతో పెరిగిన డీఏను ప్రభుత్వం ఫిబ్రవరి 1న చెల్లించనుంది. 2023 జులై 1 నుంచి గతేడాది డిసెంబర్ 31 వరకు ఉన్న డీఏ బకాయిలను జీపీఎఫ్ మిగతా2లో...

# సిఎం రేవంత్‌తో జార్ఖండ్ మంత్రి భేటీ



**హైదరాబాద్,జనవరి 12:** సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జార్ఖండ్ ఆరోగ్యశాఖ మంత్రి డా. ఇర్ఫాన్ అన్సారీ కలిసారు. సిఎం ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. తెలంగాణలో అమలువుతున్న అభివృద్ధి పనులపై వివరించారు.

## అబద్ధపు హామీల
# అధికారానికి రెండేళ్లు

- ఎరువుల ఇవ్వలేని వాడు...ఏం ఉద్ధరిస్తాడు
- గెలిచిన సర్పంచ్‌లతో కెటిఆర్ ఆత్మీయ సమ్మేళనం
- ఆనాటి వైభవం అంతా కాలగర్భంలో కలిసిందని విమర్శలు



**మహబూబ్‌నగర్,జనవరి 12:** అబద్ధపు హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా రాష్ట్రంలో ఎక్కడేసిన గొంగడి అక్కడే ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శి ంచారు. ఎరువలే సక్కగ ఇవ్వలేనోడు..ఇక రైతులను ఏం ఉద్ధరిస్తాడని సిఎం రేవంత్‌పై విరుచుకు పడ్డారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గెలిచిన సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు అభినందనలు తెలియజేశారు. పోరాడి ఓడిన వారిని కూడా అభినందించారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి మిగతా2లో...



# సుప్రీం సాక్షిగా రేవంత్ ద్రోహబుద్ధి

- పోలవరం-నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్‌కు లైన్ క్లీయర్
- అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు ద్రోహం
- మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపణ

**హైదరాబాద్,జనవరి 12:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్రోహ బుద్ధి సుప్రీంకోర్టు సాక్షిగా బట్టబయలయ్యిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. పోలవరం–నల్లమల్ల సాగర్ ప్రాజెక్ట్ కేసులో తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు అర్హత లేదని సోమవారం సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది.

మిగతా2లో...

## పక్కాగా పనిదినాలు..
# కూలీ అమలు

**● గుంతలు తవ్వే కార్యక్రమానికి చెల్లుచీటీ ● వ్యవసాయానికి ఉపాధిహామీ జోడింపు**

**● జీ రామ్ జీ పథకంపై దుష్ప్రచారం తగదు ● పాక్, బంగ్లాలో హిందూమహిళలను ప్రధానిని చేయమంటారా**

**● ఓవైసీ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి సవాల్**



2లో

## దివ్యాంగులకు మానవీయ కోణంలో సహకారం

(మొదటి పేజీ తరువాయి)

దివ్యాంగులు ఒకరినొకరు పెళ్లి చేసుకుంటే రూ. 2 లక్షల ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. వారిని ఇతరులు పెళ్లి చేసుకున్నా ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో దివ్యాంగులకు సముచిత స్థానం ఇస్తాం. క్రీడల్లో రాణించినవారికి ఉద్యోగాలు ఇస్తాం. ప్రభుత్వం కల్పించే అవకాశాలను ఉపయోగించు కుంటూ ఎదగాలి. ఈ ప్రాంతంలో ప్రత్యేక ప్రతిభావంతులకు జైపాల్ రెడ్డి స్ఫూర్తి. మా ప్రభుత్వంలో ట్రాన్స్‌జెండర్లకు కూడా ప్రభుత్వ ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. కోఆప్షన్ సభ్యులుగా ట్రాన్స్‌జెండర్‌ను కార్పొరేటర్‌గా నామినేట్ చేయాలని మంత్రులను కోరుతున్నా. అలాగే మున్సిపాలిటీల్లో కోఆప్షన్ సభ్యులుగా నామినేట్ చేయాలి. ట్రాన్స్‌జెండర్ సమస్యలను వాళ్లే చెప్పుకొనే అవకాశం ఇవ్వాలి. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యం. తెలంగాణ సమాజం స్వేచ్ఛను, సామాజిక న్యాయం, సమాన అవకాశాన్ని కోరుకుంటుంది దాదాపు వందేళ్ల తర్వాత రాష్ట్రంలో కులగణన జరిగింది. కులాల జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి. మా ఒత్తిడితోనే కేంద్రం కుల గణన చేస్తోందని సీఎం రేవంత్ వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, రాజనర్సింహ, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో గేమ్ ఛేంజర్‌గా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ స్కూల్స్ నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనని ఆయన తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్లకు ప్రాజెక్టుకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు భట్టి. స్కూల్స్ నిర్మాణ బాధ్యత పూర్తిగా జిల్లా కలెక్టర్లదేనన్నారు. పనులు పూర్తి చేయడానికి క్యాలెండర్ ఖరారు చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రతి వారం ప్రగతి సమీక్ష జరపాలని.. నిధులకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రతి 15 రోజులకు బిల్స్ పేమెంట్ చేస్తామని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ఈ ఆదేశాల ద్వారా ప్రాజెక్ట్ అమలులో వేగం, జవాబుదారీతనం, పారదర్శకత ఉండేలా చూస్తున్నామని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఎక్కువ సంఖ్యలో స్కూల్స్ అందుబాటులోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. కాగా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తెలంగాణ ప్రభుత్వ డ్రీమ్ ప్రాజెక్ట్‌గా చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ అన్నీ ఒకే చోట ఏర్పాటు చేయడం ద్వారా సామాజిక సమానత్వం, సమగ్ర విద్యా అవకాశాలు అందరికీ అందుబాటులోకి రావాలనేది ఈ ప్రాజెక్ట్ లక్ష్యం.

దేశంలోనే రోల్ మోడల్‌గా, గేమ్ ఛేంజర్‌గా నిలిచేలా ఈ స్కూల్స్ రూపకల్పన చేస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆధునిక సౌకర్యాలు, స్పోర్ట్స్, ఎక్స్‌ట్రా-కరిక్యులర్ యాక్టివిటీస్‌తో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఈ స్కూల్స్ దోహదపడతాయని రేవంత్ ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 105కి పైగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణం చేపట్టబడుతోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒకటి చొప్పున స్కూల్స్ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ ప్రాజెక్ట్‌కు వేల కోట్ల రూపాయలు కేటాయించారు.

బడ్జెట్‌లో రూ.11,600 కోట్లు, మరిన్ని దశల్లో రూ.21,000 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా. ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా కుల, మత, ఆర్థిక వివక్షలు తొలగి, అందరూ ఒకే వేదికపై చదువుకునే అవకాశం లభిస్తుంది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగా విద్యను సమానత్వ సాధనంగా మార్చడమే ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఇవి కేవలం భవనాల నిర్మాణం కాదు.. సమాజంలో సామరస్యం, సమాన అవకాశాలు, భవిష్యత్ తరాల బలోపేతం కోసం చేపట్టిన విప్లవాత్మక అడుగని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

## పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీం విచారణ

(మొదటి పేజీ తరువాయి)

వినిపించుకోవచ్చనీ అభిప్రాయపడింది. అయితే.. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ తమ వాదనలు వినిపిస్తానని గత విచారణ సందర్భంగా సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేనందున ప్రాజెక్టు పనులు ఆపాలని తెలంగాణ సర్కార్‌కు తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మరోసారి వాదనలు వినిపిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ లేదా నల్లమల సాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు నిర్మిస్తోందంటూ రిట్ పిటిషన్‌లో తెలంగాణ పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, ఆ పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథారిటీని ఆదేశించాలని అభ్యర్థించింది. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని పిటీషన్‌లో పేర్కొంది. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమల సాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని చెప్పింది. ఈ ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రిట్ పిటిషన్‌లో పేర్కొంది తెలంగాణ. అయితే.. వరద జలాలను మాత్రమే తాము వాడుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ బదులిచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టును నిలిపివేయాలని తెలంగాణా సర్కార్ పిటిషన్‌లో ప్రస్తావించింది. గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల్ల సాగర్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును ప్రతిపాదిం చిందని చెబుతోంది. ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని ఇదివరకే కేంద్ర జలశక్తి శాఖకు, జల వనరుల సంఘానికి లేఖ రాసింది. పోలవరం నల్లమల్ల సాగర్ కోసం ఏపీ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది తెలంగాణ. తమ ప్రయోజనాలకు నష్టం కలిగించే నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింకు ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరింది. కేటాయింపుల కంటే ఎక్కువ నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశం అని మంత్రి ఉత్తమ్ అన్నారు. ఏపీ ప్రభుత్వం అనేకసార్లు ఉల్లంఘనలకు పాల్పడింది. వాటిని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చాం. స్టాప్ వర్క్ ఆర్డర్‌ను అమలు చేయడం లేదని తెలిపాం. ఏపీకి కేటాయించింది 484.5 టీఎంసీలు.. కానీ ఎక్కువగా ఉపయోగించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గోదావరి, కృష్ణా బోర్డులు, అపెక్స్ కౌన్సిల్ అనుమతులు లేకుండా ఏపీ ప్రభుత్వం ముందుకెళ్తోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లాం. ముందు డిజైన్ చేసినదానికంటే అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించాం. పోలవరం ప్రాజెక్టు ఒరిజినల్ ఫామ్‌కు అదనంగా మార్పులు చేయడానికి వీల్లేదని వాదనలు వినిపించాం అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.

## పక్కాగా పనిదినాలు..కూలీ అమలు

**హైదరాబాద్,జనవరి 12** వీబీ జీ రామ్‌జీ ఉపాధి హామీ పథకం మీద కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. కొత్త చట్టంతో ఈ పథకంలో సాంకేతికత ఉపయోగించామన్నారు. పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడంతో పాటు వంద రోజుల పనిదినాలను 125కి పెంచామన్నారు. వ్యవసాయ సీజన్‌లో కూలీల కొరత లేకుండా.. వ్యవసాయానికి అనుసంధానం చేస్తున్నామన్నారు. వ్యవసాయ సీజన్ లేనప్పుడు 125 పని దినాలు దొరికేలా చూస్తామన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రాలకి అదనపు భారం పడుతుంది. అయితే, కేంద్రం కూడా అదనంగా ఖర్చు పెడుతుంది. కూలీల పేరుతో నకిలీ జాబ్ కార్డులు తయారు చేసే దళారీ వ్యవస్థను నిర్మూలించడమే ఈ చట్టం ఉద్దేశం. నీతి ఆయోగ్ సూచనలతో కొత్త ఉపాధి హామీ పథకంలో మార్పులు చేశాంఅని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని తీసేశారంటూ బీజేపీపై కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో గతంలో చాలా అవకతవకలు, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఒక సంవత్సరం ఒకచోట గుంతలు తవ్వితే మరుసటి ఏడాదీ అదే ప్రాంతంలో తవ్వేవారని విమర్శించారు. దేశంలో అనేక మార్పులు, సంస్కరణలు చేస్తున్నామని.. మార్పులకు అనుగుణంగానే ఉపాధి హామీ పథకం పేరును మార్చామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. వీబీ-జీ రామ్ జీ ద్వారా గోడౌన్‌లు నిర్మించాలని నిర్ణయించామని ఆయన వెల్లడించారు. అలాగే వ్యవసాయ రంగానికి దీనిని అనుసంధానం చేస్తామని కూడా మంత్రి వివరించారు. పని ఇవ్వలేని పరిస్థితుల్లోనూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. 'ఇది కేవలం గుంతలు తవ్వే పథకం కాదు.. దేశాన్ని అభివృద్ధి చేసే పథకం' అని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. గ్రామ పంచాయతీలకు అమలు అధికారం కల్పించామని, పని దినాలను 100 నుంచి 125కు పెంచామన్నారు మంత్రి. రాష్ట్రాలకు అదనపు నిధులు వచ్చేలా చేస్తున్నామని వివరించారు. దివ్యాంగులు, వృద్ధులకు కూడా ఉపాధి హామీ కార్డులు ఇస్తామని కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. భాజపా గాలివాటంతో గెలుస్తుందన్న కేటీఆర్ వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. గాలివాటం అయితే దేశంలో మూడుసార్లు అధికారంలోకి ఎలా వచ్చామో చెప్పాలన్నారు. మళ్లీ గెలిచి దేశంలో ప్రధానిగా మోదీ అధికారంలోకి వస్తారన్నారు. బీఆర్ఎస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిచి చూపించామన్నారు. హిజాబ్ ధరించే మహిళను ప్రధాని చేయాలని మజ్లీస్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యల పట్ల కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌కు వెళ్లి బొట్టు పెట్టుకునే హిందువును ప్రధాని చేయాలని ఓవైసీ అడుగుతారా అని ప్రశ్నించారు. పాకిస్థాన్‌లో హిందువులు లేకుండా చేశారని, బంగ్లాదేశ్‌లో హిందువులను హింసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో హిందువులు లేకుంటే ప్రజాస్వామ్యం ఉండదన్నారు. మతాల పేరు మీద రాజకీయాలు నడవవని ఓవైసీ గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు.

## సమ్మక్క-ది గ్లోరీ ఆఫ్ మేడారం

- పుస్తకాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క

**హైదరాబాద్,జనవరి 12 :** సమ్మక్క-ది గ్లోరీ ఆఫ్ మేడారం పుస్తకాన్ని మంత్రి సీతక్క ఆవిష్కరించారు. సమాచార పౌర సంబంధాల శాఖ జాయింట్ డైరెక్టర్ కన్నెకంటి వెంకటరమణ వెలువరించిన సమ్మక్క ది గ్లోరీ ఆఫ్ మేడారం అనే పుస్తకాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ ఆవిష్కరించారు. మేడారంలో జరిగిన ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర, మేడారం వడ్డే పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ములుగు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ ములుగు డిపిఆర్ఓ రఫీ తదితరులు ఈ ఆవిష్కరణ సభలో పాల్గొన్నారు. మేడారం జాతర ను కళ్ళ ముందుంచేలా విస్తృత సమాచారంతో కూడిన ఈ సమ్మక్క గ్లోరీ ఆఫ్ మేడారం పుస్తకం వెలువరించడం పట్ల రచయితను మంత్రి సీతక్క అభినందించారు. మేడారం జాతరలో గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలు, మొక్కులు, జాతర జరిగే తీరు, వివిధ రాష్ట్రాలనుండి వచ్చే గిరిజన జాతుల సంస్కృతీ సాంప్రదాయాలు, మీడియా కవరేజి, జాతరలో ఎదురయ్యే ఇబ్బందులు... ఇలా భిన్న అంశాలపై ఈ సమ్మక్క పుస్తకం ముద్రించడం జరిగింది.



## పేదల భూములకు రక్షణ కల్పిస్తాం

- భూములు అమ్మి డబ్బులు జమచేసుకునే ఆలోచన లేదు
- కూకట్‌పల్లిలో రిజిస్ట్రార్ కార్యాలయానికి పొంగులేటి శంకుస్థాపన




**హైదరాబాద్,జనవరి 12 :** తమ ప్రభుత్వం పేదల భూములకు రక్షణ కల్పించే చర్యలు తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. అవుటర్ రింగ్ రోడ్డు లోపల 39 సబ్ రిజిస్టార్ కార్యాలయాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. వాటిని 12 క్లస్టర్‌లుగా విభజించి ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు వీటి నిర్మించేందుకు ముందుకురావడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. కూకట్‌పల్లిలో ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. డబ్బే తమ ప్రభుత్వానికి ప్రాధాన్యం కాదని స్పష్టం చేశారు. భూములు అమ్మి ఖజానా నింపే ఆలోచన ప్రభుత్వానికి లేదని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ అవసరాలకు భూములు తీసుకుంటే డబ్బులతో పాటు వారికి ఇళ్లను నిర్మించి ఇస్తామని మంత్రి పేర్కొన్నారు. హౌసింగ్ కాలనీల్లో.. 40ఏళ్ల క్రితం వేసిన లేఅవుట్లలో ఖాళీ స్థలాలు బై నంబర్స్ వేసి ఆక్రమిస్తున్నారని ఎంపీ ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడలేదని మరికొన్ని చోట్లా వేలం వేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వం తలుచుకుంటే కాపడకపోవడం అనేది ఉండదని ఆయన అన్నారు. అలాంటి భూములు వేలం వేయకుండా పార్కులు చేసి ప్రభుత్వం రక్షించాలను సూచించారు. పోలీస్ స్టేషన్లు.. భూముల పంచాయతీలు పరిష్కరించే కేంద్రాలుగా మారొద్దని ఆయన కోరారు. 40ఏళ్ల క్రితం పేదలకు ఇచ్చిన స్థలాలను బ్రోకర్లు కబ్జా చేస్తున్నారని ఎంపి ఈటల రాజేందర్ ఆరోపణలు చేశారు పేదలు కొనుక్కున్న భూములకు రక్షణ కల్పించాలని సూచించారు. పేదలు కొన్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ ప్రభుత్వం ధనికుల కోసం పనిచేయడం కాదని.. పేదల సమస్యలు పరిష్కరించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ ఉద్యోగులకు సంక్రాంతి కానుక

(మొదటి పేజీ తరువాయి)

ఖాతాలో జమ చేయనుంది. సోమవారం సాయంత్రం అందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. 2023, జులై 1వ తేదీ నుంచి ఈ డీఏ అమలు చేయాలని జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. 2026 జనవరి మాసంలో తీసుకునే జీతంతో కలిపి ఈ డీఏ చెల్లించనున్నట్లు ఆ ఉత్తర్వుల్లో వివరించింది. జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఉద్యోగులకు సైతం ఈ డీఏను వర్తింప చేయనున్నారు. యూనివర్సిటీ టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కు కూడా ఈ డీఏ కింద నిధులు చెల్లించనున్నారు. 30.03 శాతం నుంచి 33.67 శాతానికి ఈ డీఏను ప్రభుత్వం సవరించిన విషయం విదితమే.

## సుప్రీం సాక్షిగా రేవంత్ ద్రోహబుద్ధి

(మొదటి పేజీ తరువాయి)

హరీష్ రావు ఒక వీడియోను విడుదల చేశారు. నాడు బీఆర్ఎస్ హయాంలో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో రైతులతో రిట్ వేయించి మరీ ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టుకు స్టే సాధిస్తే, ఇక్కడి చేతగాని కాంగ్రెస్ సర్కారు మాత్రం ఉద్దేశపూర్వకంగానే విచారణ అర్హత లేని పిటిషన్ వేసి తెలంగాణకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఈ మాత్రం దానికి ఉత్తమ్ కుమార్ సూటు బూటు వేసుకొని ఢిల్లీ దాకా పోవాల్సిన అవసరం ఉందా? అంటూ ప్రశ్నించారు. సివిల్ సూట్స్ ÷ల్ చేస్తామని తెలంగాణ ప్రభుత్వం చెప్పడం అంటే, పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్టు కట్టుకోవడానికి ఏపీకి గడువు ఇవ్వడమేనని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక వాదనలు కూడా వినడం అనేది ఏండ్లు గడిచినా ముగియని కథేనని అన్నారు. బలహీనమైన రిట్టు వేసి సంక్రాంతి పండుగ సందర్భంగా రేవంత్ చంద్రబాబుకు గురు దక్షణ చెల్లించుకున్నాడని విమర్శించారు. గురుదక్షిణ కోసం తెలంగాణకు ద్రోహం చేస్తుంటే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదు. తప్పకుండా పోరాటం చేస్తామని హరీష్ రావు వెల్లడించారు.

## అబద్ధపు హామీల అధికారానికి రెండేళ్లు

(మొదటి పేజీ తరువాయి)

వచ్చి రెండేళ్లయినా రాష్ట్రాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయకపోవడంపై మాట్లాడారు. 'గతంలో నేను మున్సిపల్ మంత్రిగా పనిచేసిన. 2014 కంటే ముందు మహబూబ్ నగర్ పట్టణం ఎట్లుండే ఇయ్యాల ఎట్లున్నది.. అనేది చూస్తున్న మీ అందరికీ తెలుసు. ఒక్క మహబూబ్‌నగరే కాదు, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్ ఇలా ఈ జిల్లాలో ఏ పట్టణం చూసినా ఎట్ల అభివృద్ధి చెందినయో మీరందరూ చూసిండ్రు. ఈ పట్టణాలు 2014కు ముందు ఎట్టుండె, ఇప్పుడు ఎట్టున్నయో మీరు గమనించండి. కేసీఆర్ నాయకత్వంలో ఒక్కటి రెండు కాదు, అన్ని పట్టణాలను అభివృద్ధి చేసుకున్నం. అన్ని పల్లెలను అభివృద్ధి చేసుకున్నం' అని చెప్పారు. 'పట్టణ ప్రగతి, పల్లె ప్రగతి కార్యక్రమాల కింద.. పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా బ్రహ్మాండంగా అభివృద్ధి చేసినం. సరే అసెంబ్లీ ఎన్నికల్లో మనం కొద్ది తేడాతో ఓడిపోయినం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయ్యింది. ఎక్కడేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఒక్క పని కూడా కొత్తగా చేసింది లేదు. పల్లెల్లో కేసీఆర్ నాయకత్వంలో ట్రాక్టర్‌లు పెట్టి, నీటి ట్యాంకర్‌లు పెట్టి, చెట్లు పెట్టి, ఇంటింటికి నల్లా పెట్టి, ప్రతి పల్లె వీధుల్లో స్ట్రీట్ లైట్‌లు పెట్టి, డంపింగ్ యార్డులు పెట్టి, వైకుంఠధామాలు కట్టి, పల్లె ప్రకృతి వనాలు కట్టి బ్రహ్మాండమైన అభివృద్ధిని కేసీఆర్ చూపించారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లలో ట్యాంకర్లలో నీళ్లు లేవు, ట్రాక్టర్‌లో డీజిల్ లేదు. వీధుల్లో లైట్లు వెలుగుతలేవ్' అని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధిని చూస్తావుంటే తనకు కడుపు నిండిన భావన కలిగిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఇవాళ మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ సర్పంచులతో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలో మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన అభివృద్ధిని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అయినా ఏం చేశారని ప్రశ్నించారు. నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల ఉమ్మడి నాయకులంతా కలిసి ఇవాళ ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించడాన్ని మెచ్చుకున్నారు. 'దాదాపు నాలుగైదు కిలోమీటర్ల ర్యాలీ తీశారు. నాకు ఆ ర్యాలీని చూస్తావుంటే 2028 ఎలక్షన్ అయిపోయింది.. మనం గెలిచినాము.. కేసీఆర్ గారు మళ్లీ ముఖ్యమంత్రి అయినారు అన్నట్లుగా అనిపించింది' అన్నారు. ఆరేడు వేల మోటార్ సైకిళ్లతోటి బ్రహ్మాండంగా ర్యాలీ తీసిండ్రని పార్టీ శ్రేణులను ప్రశంసించారు. 'ర్యాలీగా వస్తుంటే శ్రీనివాస్ గౌడ్ బీఆర్ఎస్ హయాంలో మనం నిర్మించిన ఒక్కో ప్రభుత్వ భవనాన్ని చూపిస్తూ వచ్చాడు. అవన్నీ చూస్తే నాకు కడుపు నిండినట్లు అయ్యింది. మహబూబ్‌నగర్ పట్టణం ఒకప్పుడు ఎట్లుండే, ఇప్పుడు ఎట్లున్నదో మీరందరూ చూస్తా ఉన్నారు. ఒక్క మహబూబ్‌నగరే కాదు నారాయణపేటగానీ, జడ్చర్ల అభివృద్ధిగానీ, రహదారుల విస్తరణగానీ, ÷÷-లవోర్లుగానీ, రహదారుల వెంట వీధి వ్యాపారుల కోసం కట్టిన స్ట్రీట్ వెండింగ్ జోన్‌లుగానీ నాడు మనం చేసిన అభివృద్ధికి నిదర్శనం' అన్నారు.

# ఐకమత్యంతోనే రాజ్యాధికారం సాధ్యం: ధర్మపురి సంజయ్

**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**
జిల్లా రాజకీయాల్లో మున్నూరు కాపులు కీలక శక్తిగా ఎదగాలని, ఐకమత్యమే ఆయుధంగా ముందుకు సాగాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మపురి సంజయ్ పిలుపునిచ్చారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాప్రతినిధుల సన్మాన మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అంతకుముందు శివాజీ నగర్ నుంచి ప్రగతి నగర్ వరకు వేలాది మంది కార్యకర్తలతో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ నగర పురవీధుల్లో హోరెత్తింది. కేరింతలు, నినాదాల మధ్య సాగిన ఈ ర్యాలీ సంఘం ఐక్యతను చాటిచెప్పింది. అనంతరం జరిగిన సమ్మేళనంలో సంజయ్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మున్నూరు కాపు సామాజికవర్గం నుంచి 450కి పైగా ప్రజాప్రతినిధులు ఎన్నిక కావడం చిన్న విషయం కాదు. ఇది మన జాతి గర్వించదగ్గ పరిణామం. గెలిచిన ప్రతి ఒక్కరి వెనుక వేలాది మంది ఆశలు ఉన్నాయి. రాజకీయాల్లో ఎదగాలనుకునే వారికి నా వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయి. మా తండ్రి, దివంగత నేత ధర్మపురి శ్రీనివాస్ గారు సంఘం బలోపేతానికి ఎనలేని కృషి చేశారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, సంఘం అభివృద్ధికి నా జీవితాన్ని అంకితం చేస్తాను అని ఉద్వేగంగా ప్రసంగించారు. త్వరలో జిల్లాలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ఈ సందర్భంగా ప్రకటించారు. ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్ మాట్లాడుతూ.. సంజయ్ నాయకత్వంలో మున్నూరు కాపు సంఘానికి పూర్వ వైభవం వచ్చిందని, జిల్లా రాజకీయాల్లో ఆయన చరిత్ర సృష్టిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 67 మంది సర్పంచ్‌లు, 60 మంది ఉపసర్పంచ్‌లు, 432 మంది వార్డు సభ్యులను సంజయ్ ఘనంగా సన్మానించారు. మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మాజీ మేయర్ ఆకుల సుజాత తదితరులు పాల్గొన్న ఈ సభ మున్నూరు కాపుల ఆత్మీయ సంగమంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో






ధర్మపురి సురేందర్, రామర్తి గంగాధర్, ఆకుల చిన్న రాజేశ్వర్, బంటు బలరాం, ఆకుల శ్రీశైలం, తోట రాజశేఖర్, మిద్దె రవీందర్, దారం పోతన్న, అంగిరేకుల సాయిలు, వరాల రాజు, ఆంజనేయులు కాపు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ మున్సిపాలిటీ ఓటర్ల తుది జాబితా ఖరారు

**- 38 వార్డుల్లో 69,426 మంది ఓటర్లు**




**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :** బోధన్ మున్సిపాలిటీలో ఎన్నికల ప్రక్రియ వేగం పుంజుకుంది. మున్సిపల్ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా సోమవారం పట్టణ ఓటర్ల తుది జాబితాను అధికారులు అధికారికంగా ప్రకటించారు. మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ మున్సిపాలిటీ కార్యాలయంలో ఫొటోలతో కూడిన ఈ జాబితాను విడుదల చేశారు. పట్టణంలోని మొత్తం 38 వార్డుల పరిధిలో 69,417 మంది ఓటర్లు ఉన్నట్లు కమిషనర్ వెల్లడించారు. ఈసారి పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. మహిళా ఓటర్లు 35,720, పురుష ఓటర్లు 33,696 ఇతరులు 01 ఉన్నారు. గతంలో విడుదల చేసిన ముసాయిదా జాబితాపై రాజకీయ వర్గాల నుంచి తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమైన విషయం తెలిసిందే. పలు వార్డుల్లో ఓటర్ల పేర్లు తారుమారయ్యాయని, ఒక వార్డులోని ఓటర్లను వేరొక వార్డులో చేర్చారని వివిధ పార్టీల నాయకులు ఫిర్యాదులు చేశారు. తాజాగా విడుదల చేసిన తుది జాబితాలో ఈ ఫిర్యాదులను ఏ మేరకు పరిగణనలోకి తీసుకున్నారు? తప్పులను సరిదిద్దారా లేదా? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. తుది జాబితా వెలువడటంతో పట్టణంలో రాజకీయ కోలాహలం మొదలైంది.

# మద్యం బాబుకు ఏడు రోజుల జైలు

**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**
మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి న్యాయస్థానం ఏడు రోజుల జైలు శిక్ష విధించింది. నిజామాబాద్ వన్‌టౌన్ ఎస్హెచ్ఓ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8వ తేదీన నగరంలోని గాంధీ చౌక్ వద్ద పోలీసులు ముమ్మరంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బ్యాంక్ కాలనీ ఆర్య నగర్‌కు చెందిన దినేష్ మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు చిక్కాడు. బ్రీత్ అనలైజర్ పరీక్షలో మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తేలడంతో అతనిపై కేసు నమోదు చేశారు. సోమవారం నిందితుడిని స్పెషల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా నేరం నిరూపణ కావడంతో ఏడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రాణాపాయంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం మొదటిసారి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా లేదా జైలు శిక్ష, రెండోసారి పట్టుబడితే రూ.15 వేలు వరకు జరిమానాతో పాటు జైలు శిక్ష విధిస్తామని స్పష్టం చేశారు.

# 30 ఏళ్లు కొట్లాడి తెచ్చుకున్న రిజర్వేషన్లను మాదిగ జాతి యువత అందిపుచ్చుకోవాలి.

**- త్వరలో జిల్లా కేంద్రంలోమాదిగ ఉప కులాల నుండి గెలిచిన సర్పంచు ఉ వార్డ్ మెంబర్లకు సన్మానం ఉంటుంది.**

**- ఎమ్మార్పీఎస్, జాతి అధినేత మందకృష్ణ మాదిగ నే మాదిగ జాతికి రక్షణ కవచం.**

**బజార్ హత్నూర్, జనవరి 12(డిడి9వార్త న్యూస్):-**
ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోసోమవారం రోజు బీసీ భవనంలో ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశశీజరిగింది. ఈ సమావేశంకు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,, 30 ఏళ్లు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ఎమ్మార్పీఎస్ పోరాటశీ సాగించి,ఎందరో ఉద్యమకారుల త్యాగాల ఫలితంగా రిజర్వేషన్ ఫలాలు అందుతున్నవి. ఈ నేపథ్యంలో మాదిగజాతి యువతచదువుపై ప్రత్యేకశ్రద్ధపెట్టిముందుకెల్లాలని కోరారు. ముఖ్యంగా మాదిగ జాతి ఉద్యోగస్తులుతమవంతు బాధ్యతగా చదువుతున్న పేద యువతను ఆర్థికంగాఆదుకొని అండగా నిలబడాలని కోరారు.ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోను, జిల్లావ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ నిర్మాణాత్మకంగా సంస్థాగతంగా బలోపేతం చేయడంకోసంజిల్లాకమిటీ,మండల అధ్యక్షులు వారి పూర్తి సమయం వేచ్చిశీచి చొరవ తీసుకోవన్నారు.

చదువు, అభివృద్ధి,రాజకీయ ఎదుగుదల కోసంఎమ్మార్పీఎస్ జాతి ప్రజలకు అండగా ఉంటుందని సమస్యల ఎజెం



డాగా వాటి పరిష్కారం కోసం ముందు వరుసలో నిలబడి కొట్లాడుతుందని వారు స్పష్టం చేశారు, మాదిగల ఉపకులాల ఐక్యతను చాటే దిశలో జిల్లా కేంద్రంలో అతి త్వరలో సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు, ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కాంబ్లే బాలాజీ మాదిగ, సందూరి వినయ్ సాగర్, ఇండ్ల ఎల్లన్న , ఆరేపల్లి గణేష్, వీహెచ్పీఎస్ జిల్లా అధ్యక్షులు కల్లేపల్లి ప్రేమ్ రాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా పెల్లి నవీన్ మాదిగ, దాసరి రాంప్రసాద్, గజ్జల కాంతారావు, కృష్ణ పెల్లి అంకుష్, మేకల దీపక్, జామ్లే నాందేవ్ తదితరులు పాల్గొన్నారు,

# హున్సా సబ్ సెంటర్‌ను తనిఖీ చేసిన వైద్యాధికారి రాజ్‌కుమార్

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**



సాలూర మండల పరిధిలోని హున్సా గ్రామ ఆరోగ్య ఉప కేంద్రాన్ని మండల వైద్యాధికారి డాక్టర్ రాజ్‌కుమార్ సందర్శించారు. సోమవారం కేంద్రంలో నిర్వహిస్తున్న వైద్య సేవలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లోని హాజరు పట్టికను, మందుల నిల్వలను మరియు రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి సూచించారు. గర్భిణీలు, బాలింతలు మరియు చిన్న పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారికి సకాలంలో టీకాలు వేయాలని ఆదేశించారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముం దుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఏవైనా అత్యవసర కేసులు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# పునీత జోజప్ప ఆలయంలో రజతోత్సవ సంబరాలు

**- వైభవంగా దేవాలయ పునఃప్రతిష్ఠ**

**- హాజరైన కార్డినల్ పూల అంతాని,**

**- అగ్రపీఠాదిపతులు మల్లవరపు ప్రకాష్**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**
సాలూర మండలం జాడి జమాల్‌పూర్ గ్రామ విచారణ పరిధిలోని పునీత జోజప్ప దేవాలయం సోమవారం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. దేవాలయ నిర్మాణం జరిగి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా (సిల్వర్ జూబిలీ) పునఃప్రతిష్ఠా మహోత్సవాన్ని భక్తుల కోలాహలం మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. దేవాలయానికి విచ్చేసిన హైదరాబాద్ మేత్రాసనం మహా ఘనత వహించిన డాక్టర్ కార్డినల్ పూల అంతాని, విశాఖ విశ్రాంతి అగ్రపీఠాదిపతులు మహా ఘనత వహించిన డాక్టర్ మల్లవరపు ప్రకాష్‌లకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు ప్రత్యేక దివ్యబలి పూజను సమర్పించి, పండుగ సందేశాన్ని ఇచ్చారు. పునీత జోజప్ప



ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలని, విశ్వాసంతో కూడిన జీవితం గడపాలని వారు ఆకాంక్షించారు. విచారణ గురువులు ఫాదర్ జాన్ విజయ్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకలో గాయక బృందం ఆలపించిన కీర్తనలు భక్తులను ఆధ్యాత్మిక లోకంలో ముంచెత్తాయి. రజతోత్సవం కావడంతో దేవాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల మండలాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం విచ్చేసిన అతిథులను విచారణ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. ఈ మహోత్సవంలో వివిధ విచారణల గురువులు, మాతావాసులు, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

# బ్యాంకు ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలి: బోధన్ ఎస్సై భాస్కర్ చారి



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**
సాంకేతికత పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, వీటి పట్ల ఖాతాదారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని బోధన్ పట్టణ ఎస్సై భాస్కర్ చారి సూచించారు. సోమవారం బోధన్ పట్టణ కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్ ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా 'మీ బ్యాంక్ ఖాతా బ్లాక్ అయ్యింది, కేవైసీ అప్‌డేట్ చేయాలి అంటూ వచ్చే నకిలీ మాటలను నమ్మి వ్యక్తిగత వివరాలను పంచుకోవద్దని కోరారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఓటీపీ నంబర్లను ఎవరికీ చెప్పకూడదు. మొబైల్‌కు వచ్చే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దు. లాటరీ తగిలిందని, తక్కువ ధరకే వస్తువులు వస్తాయని వచ్చే ఆఫర్ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. ఒకవేళ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో ఖాతాదారులు పాల్గొన్నారు.

# మేరు సంఘం జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**
నిజామాబాద్ జిల్లా మేరు సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు అత్యంత సౌహార్దపూర్వక వాతావరణంలో ఏకగ్రీవంగా ముగిశాయి. సంఘం బలోపేతమే ధ్యేయంగా సభ్యులందరూ ఏకాభిప్రాయానికి రావడంతో, ఎన్నికల షెడ్యూల్ ప్రకారం సోమవారం నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో మిగిలిన అభ్యర్థులందరూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ముఖ్య ఎన్నికల అధికారి సంఘ సత్యవ్రత్ అధికారికంగా ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడు సోమ హన్మంత్ రావు (నిజామాబాద్), ప్రధాన కార్యదర్శి దర్భస్తూ శ్యామ్ (ఆర్మూర్), ఉపాధ్యక్షులు కొట్టూర్ చంద్రకాంత్ (నిజామాబాద్), కొట్టూర్ శ్రీనివాస్ (బోధన్), కోశాధికారి కొక్కు రాజేశ్వర్ (సిరికొండ), సంయుక్త కార్యదర్శులు గట్ల నరేందర్ (నిజామాబాద్), తాళ్ల నర్సింలు (నిజామాబాద్) లు ఎన్నిఅక్కయ్యరు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. జిల్లాలోని మేరు



కులస్తులందరినీ ఏకం చేసి, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతామన్నారు. కులవృత్తి నమ్ముకున్న పేదలకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని, సంఘం అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఐక్యమత్యంతో ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన జిల్లాలోని సంఘ సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# రౌడీషీటర్ అమేర్ అలీ ఖాన్ నగర బహిష్కరణ



**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :** నిజామాబాద్ నగరంలో వరుస నేరాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీషీటర్ అమేర్ అలీ ఖాన్ అలియాస్ బర్సాత్ అమేర్ (27)పై జిల్లా బహిష్కరణ వేటు పడింది. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది పాటు సదరు రౌడీషీటర్ జిల్లాలో అడుగుపెట్టరాదని స్పష్టం చేశారు. నగరంలోని ఆటో నగర్‌కు చెందిన అమేర్ అలీ ఖాన్ గత ఆరేళ్లుగా వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్నాడు. ఇతనిపై జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో మొత్తం 22 కేసులు నమోదై ఉన్నాయి. గతంలో ఇతనిపై పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు పంపినప్పటికీ, ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పాటు నిరంతరం శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడు. రానున్న ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు, హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్-1348 ఫస్లీలోని సెక్షన్ 26(1)(ఘ) ప్రకారం తనకున్న అధికారాలను ఉపయోగించి కమిషనర్ ఈ బహిష్కరణ ఉత్తర్వులు ఇచ్చారు. నిబంధనలు అతిక్రమించి జిల్లాలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేరస్తులు, రౌడీషీటర్ల పట్ల రాజీ లేని వైఖరి అవలంబిస్తామని, ప్రజల రక్షణే తమ ప్రాధాన్యతని పోలీస్ యంత్రాంగం పేర్కొంది.

# పోలీస్ ప్రజావాణికి 35 ఫిర్యాదులు




**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య బాధితుల నుండి నేరుగా ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను సీపీకి వివరించగా మొత్తం 35 ఫిర్యాదులు నమోదయ్యాయి. అర్జీలను స్వీకరించిన సీపీ, సంబంధిత పోలీస్ స్టేషన్ల ఎస్సైలు మరియు సీఐలతో ఫోన్లో మాట్లాడారు. ఫిర్యాదుల స్థితిగతులను అడిగి తెలుసుకుని, చట్టప్రకారం తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు ఎలాంటి మధ్యవర్తులు లేదా పైరవీకారుల ప్రమేయం లేకుండా, నిర్భయంగా పోలీసులను సంప్రదించి సేవలు పొందాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు పోలీసు శాఖను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి ద్వారా సామాన్య ప్రజల సమస్యలను నేరుగా వింటున్నాము. బాధితులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చూడడమే మా ప్రాధాన్యత. పోలీసు సేవలను ప్రజలు స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని పోలీస్ కమిషనర్

# జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన సీపీ సాయి చైతన్య



**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :** జిల్లా ప్రజలందరికీ నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా ప్రజలు, పోలీస్ అధికారులు, సిబ్బందికి పండుగ శుభాకాంక్షలు అందజేశారు. తెలుగు వారి పెద్ద పండుగైన సంక్రాంతిని ప్రజలందరూ తమ కుటుంబ సభ్యులతో కలిసి భోగి, సంక్రాంతి, కనుమ వేడుకలను అంగరంగ వైభవంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మన సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని కోరుకున్నారు. ప్రజలందరూ నిండు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. పండుగ పూట ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీస్ శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని, అందరూ శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని ఈ సందర్భంగా సీపీ సూచించారు

# యువతకు ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద



**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :** భారతదేశ కీర్తి ప్రతిష్టలను ప్రపంచవ్యాప్తం చేసిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని, ఆయన బోధనలు నేటి యువతకు దిక్సూచి అని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ అన్నారు. స్వామి వివేకానంద 164వ జయంతిని పురస్కరించుకుని సోమవారం గాజులపేటలోని వివేకానంద విగ్రహానికి సంఘం నాయకులతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరాల సుధాకర్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. వివేకానంద సాహిత్యాన్ని అధ్యయనం చేసిన వారు అన్ని రంగాల్లో రాణిస్తారని పేర్కొన్నారు. నేటి కాలంలో యువత చిన్న చిన్న విషయాలకే మనోవ్యాకులత (డిప్రెషన్)కు లోనవుతున్నారని, ఒత్తిడికి గురై హైరానా పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వివేకానంద సాహిత్యాన్ని చదవడం అలవాటు చేయాలని, తద్వారా వారిలో ఆత్మస్థైర్యం పెరిగి జీవితంలో అత్యున్నత శిఖరాలను అధిరోహిస్తారని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, తోట రాజశేఖర్, బగ్గలి అజయ్, రేఖ, బాలన్న, సదానంద్, సత్యనారాయణ, రాజేష్, శ్రీకాంత్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద



**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**
భీమ్‌గల్ మండలంలోని దేవనపల్లి గ్రామంలో స్వామి వివేకానంద 164వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్ శేఖర్ లకవత్ ఆధ్వర్యంలో యువత కోసం ప్రత్యేకంగా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలు యువతలో క్రీడా స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపాయి. ఆశయ సాధనే లక్ష్యం: ఈ సందర్భంగా సర్పంచ్ శేఖర్ లకవత్ మాట్లాడుతూ.. స్వామి వివేకానంద యువతకు గొప్ప ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఆయన బోధించిన క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు దేశభక్తిని ప్రతి యువకుడు అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. యువత దురలవాట్లకు దూరంగా ఉండి, వివేకానందుని ఆశయ సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బోండ్ల గంగసాయిలు, గ్రామ పెద్దలు రాములు, మహిపాల్, ప్రసాద్, కారోబార్ రాజు మరియు గ్రామ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లకు సర్పంచ్ అభినందనలు తెలిపారు.

# చౌట్‌పల్లిలో ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు



కమ్మర్‌పల్లి మండలంలోని చౌట్‌పల్లి గ్రామంలో స్వామి వివేకానంద 164వ జయంతి (జాతీయ యువజన దినోత్సవం) వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రామంలోని వివేకానంద విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.బిజెపి యువ మోర్చా ఆధ్వర్యంలో.. బిజెపి యువ నాయకులు పుప్పాల నిరంజన్ పటేల్ ఆధ్వర్యంలో వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా నిరంజన్ పటేల్ మాట్లాడుతూ.. స్వామి వివేకానంద కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని, భారతీయ యువతకు ఒక గొప్ప స్ఫూర్తి శక్తి అని కొనియాడారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ దేశాభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సట్ట కార్తీక్, కొమ్ముల రవీందర్, గుండోజీ రోహిత్, యోగేష్, రాజు, సన్నీ, తక్కురి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.గ్రామ పంచాయతీ నివాళి: గ్రామ సర్పంచ్ మహబూబ్, ఉప సర్పంచ్ విశాల్ లు వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందుడి బోధనలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని, గ్రామాల్లో యువత సేవా దృక్పథంతో ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# సాలూరలో ఘనంగా వివేకానంద జయంతి



**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**
సాలూర మండల కేంద్రంలో స్వామి వివేకానంద 164వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గ్రామస్థులు, వివిధ పార్టీల నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'జై వివేకానంద' అంటూ చేసిన నినాదాలు మార్మోగాయి. ఈ సందర్భంగా స్థానిక యువకులు మాట్లాడుతూ.. భారతదేశం యొక్క గొప్పతనాన్ని, మన సంస్కృతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని కొనియాడారు. నేటి యువత సోమరితనాన్ని వీడి, వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, దేశభక్తి కలిగిన యువతతోనే దేశ భవిష్యత్తు సాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సాలూర గ్రామ పెద్దలు, యువజన సంఘాల సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతపై రాజీ వద్దు: జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**



రోడ్డు ప్రమాదాల నివారణ కేవలం జరిమానాలతోనే సాధ్యం కాదని, వాహనదారుల్లో మార్పు వచ్చినప్పుడే ప్రాణ నష్టం తగ్గుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రోడ్డు భద్రతా మాసోత్సవ సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రహదారి నిబంధనలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల తీరుపై కలెక్టర్ గణాంకాలను విడుదల చేశారు. గత ఏడాదితో పోలిస్తే మరణాల సంఖ్యలో కొంత తగ్గుదల కనిపించినప్పటికీ, ప్రమాదాల తీవ్రత ఇంకా ఆందోళనకరంగానే ఉందన్నారు. 2024 ఏడాదిలో 856 ప్రమాదాలు జరగ్గా, 351 మంది మరణించారు. 2025 నవంబరు నాటికి 815 ప్రమాదాలు చోటుచేసుకోగా, 280 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న బ్లాక్ స్పాట్స్ వద్ద తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. పోలీస్, రవాణా, ఆర్ అండ్ బి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, రోడ్డు ఇంజనీరింగ్ లోపాలను సరిదిద్దాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్ లేకపోవడం వంటి కారణాల వల్లనే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయని, వీటిపై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా అధికారులు, పోలీస్ ఉన్నతాధికారులు మరియు సంబంధిత శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :** ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుల పట్ల అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. సోమవారం నిజామాబాద్ ఐడీఓసీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె అధికారులతో కలిసి అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు.జ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని నలుమూలల నుంచి బాధితులు ఎన్నో ఆశలతో ప్రజావాణికి వస్తారని, వారి సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయకూడదని స్పష్టం చేశారు. ప్రజావాణికి అన్ని శాఖల జిల్లా అధికారులు విధిగా హాజరుకావాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై మొత్తం 84 ఫిర్యాదులు నమోదయ్యాయి. నమోదైన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్దియన్ మావి, డీఆర్డీఓ పీడీ సాయి గౌడ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# అపూర్వ రాగం

జరిగిన కథ రోహ తన పరిచారికను మల్లికాగిరికి వెళ్లుమంటుంది. కుసుమ శ్రేష్ఠి తనకు విశ్రాంతి అవసరం లేదని, మల్లసుపర్వతం వద్దకు వెళ్లేందుకు తన సంసిద్ధత ప్రకటిస్తాడు.



మాధవుని బోధనలు వింటున్న గుంపులో నుంచి ఒక యువకుడు.. కత్తితో అతని మీద దాడి చేయబోతాడు. తర్వాత..“నేను ఒక క్షత్రియుణ్ని. నాది ధర్మాగ్రహం! ప్రజలందరికీ పిరికి మందు నూరిపోస్తూ.. పలాయన వాదం ప్రచారం చేస్తున్న మీ అందరి మీద నా పగ. మిమ్మల్ని అందరినీ తెగ నరికితే గానీ నా కోపం చల్లారదు” అంటూ ఖడ్గాన్ని పైకెత్తినాడు.మరుక్షణం సాధనానంద తల రెండు వ్రయ్యలయ్యేది కానీ..ఆ క్షత్రియ యువకుని కత్తి.. ఎత్తినది ఎత్తినట్లే గాలిలో ఆగిపోయింది, అతని చేతితో సహా.పోటిసుడు అక్కడికి ఆ క్షణం ఎలా చేరుకున్నాడో ఎవ్వరికీ తెలవదు. ముఖ్యంగా చంద్రహత్థికి.క్షత్రియ యువకుని చేయి పోటిసుని చేతిలో ఉంది. అతడెంత గట్టిగా పట్టుకున్నాడో.. ఆ యువకుని మొఖం చూస్తేనే తెలుస్తున్నది.ఆ దృశ్యం చూసి ఠక్కున గుర్తుకొచ్చి పక్కన చూసుకొని ఉలిక్కిపడింది చంద్రహత్థి. తన పక్కనే కూర్చొని ఉన్న ప్రియుడు పోటిసుడు.. అక్కడ ఎట్లా ఉన్నాడో ఆమె ఊహకు అస్సలు అందడం లేదు. పైగా నడవడానికి ఇబ్బంది పడే ఈ వీరుడు.. ఇక్కడ మాయమై అక్కడ ప్రత్యక్షం కావడం ఆమెకు నిజంగా ఒక కలలా, మాయలా ఉంది. అదే సమయంలో ఆయనకు ఏమైనా అవుతుందేమోనన్న భయం ఆమెను నిలువెల్లా కంపించేటట్లు చేసిందిమరుక్షణం తేరుకొని మెల్లమెల్లగా దారి చేసుకుంటూ వేదిక వద్దకు వెళ్లసాగింది చంద్ర.తన చేతిని విడిపించుకునే ప్రయత్నం చేస్తూ,అసహనంగా అన్నాడు ఆ క్షత్రియ వీరుడు..“ఎవరు నువ్వు? నీకు ఇక్కడ ఏం పని? నన్ను ఎందుకు అడ్డుకున్నావ్? వదలకపోతే నీ కథ కూడా ఇక్కడే ముగించేస్తాను” అన్నాడు.

వెన్నెల విరిసినట్లు నవ్వినాడు పోటిసుడు“ఎవరి కథ ఎక్కడ, ఎట్లా ముగిసిపోతుందో తెలవదు కానీ, ఎవని ఆవేశం వాని పతనాన్ని శాసిస్తుందనేది మాత్రం నూటికి నూరుపాళ్లు నిజం!” అని పాఠం చెబుతున్నట్లు పలికి, వాని భుజం వెనుక ఉన్న బంతిగిన్నె కీలును ఆనుకొని ఉన్న నరాన్ని వొడుపుగా నొక్కినాడు.“అమ్మా!” అంటూ చేయిపట్టు వదిలినాడు క్షత్రియుడు. అతని చేతిలో నుంచి ఖడ్గం జారిపోతుంటే.. కింద పడిపోకుండా పట్టుకున్నాడు మరో చేత్తో పోటిసుడు. బాధ తట్టుకోలేక మోకాళ్ల మీద కూలబడ్డాడు ఆ క్షత్రియుడు.

వెంటనే కత్తి మొనను అతని ఎదకు ఆనించి, విలాసంగా నవ్వినాడు పోటిసుడు.

“ఇప్పుడు చెప్పు! ఎవరి కథ ముగిసిపోతుంది?” అన్నాడు పోటిసుడు.. కళ్లు ఎగరేస్తూ.

“చూడు సోదరా! నీతో నాకు వైరం లేదు. జాతిని నిర్వీర్యం చేస్తున్న వీళ్ల శుష్కోపదేశాలను అడ్డుకోకపోతే సమస్త భారత ధాత్రి పరాయి పాలకుల హస్తగతం అవుతుంది. దయచేసి యథర్థం గ్రహించి, నా ప్రయత్నానికి అడ్డుతగలకు” అన్నాడు ఆ క్షత్రియ యువకుడు బతిమాలుతున్నట్లు.“మిత్రమా! ఉపదేశాలు, సందేశాలు తప్పుదారి పట్టించవు. మతాలు, అభిమతాలు మనిషిని నిర్వీర్యుణ్ని చేయవు. సిద్ధాంతాలు, వ్యవస్థలు మనిషి పతనాన్ని కోరుకోవు. వాటిని అనుసరించే మనుషుల్లో చిత్తశుద్ధి లోపించి, స్వార్థం మితిమీరినప్పుడే.. అవి గతి తప్పి మానవజాతిని పెడదారులు పట్టిస్తాయి”పోటిసుడు మాట్లాడుతుండగానే చేతుల్లో రకరకాల ఆయుధాలు ధరించిన మరో నలుగురు మనుషులు ఆ క్షత్రియ యువకునికి దన్నుగా నిలిచినారు.వాళ్లను పరిశీలనగా చూస్తూ..

“మిత్రులారా! మీరు నలుగురే కాదు, నలభై మంది ఎదిరించినా.. అవలీలగా మట్టి కరిపించగలను నేను. కానీ, ఇది యుద్ధక్షేత్రం కాదు; శాంతి యజ్ఞం. ఇక్కడ జరుగుతున్నది జ్ఞానవితరణ. మీకు ఏమైనా సందేహాలుంటే నివృత్తి చేసుకోండి; విభేదాలుంటే చర్చించుకోండి; విపరీత ధోరణి ఉంటే మాటలతో ఖండించండి. అంతేగానీ ఈ శాంతికపోతాల మీద అస్త్రాలు ఎక్కుపెట్టి, నెత్తుటి మరకలు అంటించుకొని మానవత్వాన్ని కించపరచకండి!” అన్నాడు పోటిసుడు.అతని ధైర్యం, సాహసం, వాగ్ధోరణి అందరినీ ఆశ్చర్యపరచడంతోపాటు, అతని పట్ల ఆరాధన భావంకలిగించినాయి.అప్పుడు మాధవుడు ఇట్లా అన్నాడు..

“నాయనలారా! ఈ యువకిశోరం ఎంతో పరిణతతో మాట్లాడినాడు. మా మతాన్ని, అభిమతాన్ని ప్రకటించినాడు. అశోకుని వంటి మహా సమ్రాట్టుకే శాంతి మంత్రం ఉపదేశించిన దివ్య శక్తి ఈ బుద్ధ మార్గం. మానవ జీవనాన్ని ఆనందమయంగా, ఆదర్శవంతంగా మలచడమే మా “ఇప్పుడు చెప్పండి? మీరంతా ఎవరు? ఏంకోరుకుంటున్నారు?” సూటిగా అడిగినాడు పోటిసుడు.“సుందరీ! నీ పేరు చంద్రముఖి కదా!” కన్నార్పకుండా చూస్తూ అన్నాడు “అందగాడా! నీకు నచ్చిన పేరుతో పిలుచుకో. నీవు ఎట్లా పిలిచినా పలుకుతా!” విరిసీ విరియని “నా పేరు సౌగంధికానందిని. గంధ, గంధిక, సౌగంధిక, ఆనందిని, నందిని, సౌగంధిని.. ఎట్లాగైనా పిలవచ్చు!” అంటూ తన ఇంటివైపు వెళ్లడానికి తిరిగింది.

వామదేవుడు తోలుబొమ్మలా ఆమె వెంటనే అటు తిరిగినాడు.

“ఒరేయ్ దేవా! నీ స్వేచ్ఛను హరించే ఉద్దేశం, ఆనందాన్ని అడ్డుకునే ఆలోచన నాకు లేవు కానీ, వాస్తవం గుర్తుచేస్తున్నాను. దయచేసి విను! ఆపై నీవు ఏ నిర్ణయం తీసుకున్నా నాకు అభ్యంతరం లేదు”.. చేతులు జోడించి గంభీరంగా ఇట్లా అన్నాడు జయసేనుడు.

“నా తండ్రి, అతణ్ని వెతుక్కుంటూ వెళ్లిన పోటిసుని జాడ కనిపెట్టేందుకు మనం బయలుదేరినం. మరికొంచెం సేపటిలో మా నాయన గారు విడిది చేసే

“ఒరేయ్ దేవా! నీ స్వేచ్ఛను హరించే ఉద్దేశం, ఆనందాన్ని అడ్డుకునే ఆలోచన నాకు లేవు కానీ, వాస్తవం గుర్తుచేస్తున్నాను. దయచేసి విను! ఆపై నీవు ఏ నిర్ణయం తీసుకున్నా నాకు అభ్యంతరం లేదు”.. చేతులు జోడించి గంభీరంగా ఇట్లా అన్నాడు జయసేనుడు.

“నా తండ్రి, అతణ్ని వెతుక్కుంటూ వెళ్లిన పోటిసుని జాడ కనిపెట్టేందుకు మనం బయలుదేరినం. మరికొంచెం సేపటిలో మా నాయన గారు విడిది చేసే

“ఒరేయ్ దేవా! నీ స్వేచ్ఛను హరించే ఉద్దేశం, ఆనందాన్ని అడ్డుకునే ఆలోచన నాకు లేవు కానీ, వాస్తవం గుర్తుచేస్తున్నాను. దయచేసి విను! ఆపై నీవు ఏ నిర్ణయం తీసుకున్నా నాకు అభ్యంతరం లేదు”.. చేతులు జోడించి గంభీరంగా ఇట్లా అన్నాడు జయసేనుడు.

“నా తండ్రి, అతణ్ని వెతుక్కుంటూ వెళ్లిన పోటిసుని జాడ కనిపెట్టేందుకు మనం బయలుదేరినం. మరికొంచెం సేపటిలో మా నాయన గారు విడిది చేసే

ప్రదేశాన్ని చేరుకుంటాం. ఆయనను కలిస్తే మనకు చాలా ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి. ప్రయత్నాన్ని అర్ధాంతరంగా ఆపేయడం కన్నా.. పని పూర్తి చేసుకున్న తర్వాత నీకు కావలసినన్ని రోజులు ఇక్కడ ఉండవచ్చు. ఆలోచించుకో! నీవు వస్తావా? ఉండిపోతావా? ఏదో ఒక సమాధానం చెబితే నేను ఇక్కడి నుండి బయలుదేరుతాను”ఆలోచనలో పడ్డాడు వామదేవుడు.వామదేవుని మెదడు మొద్దు బారిపోయింది. జయసేనుని ఆలోచన స్పష్టంగా ఉన్నది కానీ ఈ అందమైన సౌగంధినిని వదిలి వెళ్లడానికి మనసు ఎంతమాత్రం అంగీకరించడం లేదు.“నీ మౌనం నాకు అర్థమైంది దేవా! నీవు ఈ జాణను వదిలి రాలేవు. సరే! నీ ఇష్టం! నేను బయలుదేరుతున్నాను. నీ వద్ద ఉన్న ద్రవ్యమంతా అయిపోయిన తర్వాత.. రావాలనుకుంటే పోదనకు రావచ్చు. ధనం చాలదంటే చెప్పు! నా వద్ద ఉన్నదాంట్లో నుంచి కూడా కొంత నీకు ఇస్తాను” అంటూ తన నడుముకు ఉన్న మూటను విప్పబోయినాడు జయ.

“అక్కరలేదు జయా!” జయసేనుని ప్రయత్నాన్ని అడ్డుకుంటూ అన్నాడు వామదేవుడు.

“నేను ఇక్కడనే ఉండిపోవాలని అనుకోవడం లేదు. అలాగే, ఈ క్షణం సౌగంధినిని వదిలి రాలేను. నీవు వెళ్లు! నేను రేపు ఉదయమే మల్లసు పర్వతానికి చేరుకుంటాను. అక్కడ కలుసుకోలేకపోతే పోదన నగరానికైనా వస్తాను” చివరికి ఒక నిర్ణయానికి వచ్చినట్లు చెప్పకనే చెప్పినాడు.“నీ ఇష్టం! ఇప్పటికే చాలా ఆలస్యమైంది..” అంటూ ఒక్క ఉదుటున గుర్రాన్ని ఎక్కినాడు జయసేనుడు.“మీరు ఇక్కడి నుంచి వెళ్లలేరు!” అడ్డుకున్నది సౌగంధికానందిని.

“ఏం?” పరిహాసంగా అన్నాడు జయసేనుడు.

# భీంగల్‌లో ఆహార భద్రతా అధికారుల తనిఖీలు



**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :** భీంగల్ పట్టణంలోని పలు దుకాణాల్లో కాలం చెల్లిన కూల్ డ్రింక్స్, చిప్స్ ప్యాకెట్లను విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుతో సోమవారం ఆహార భద్రతా శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ జిల్లా చైర్మన్ డాకా దుర్గాప్రసాద్ వినియోగదారుల తరపున చేసిన విజ్ఞప్తికి అధికారులు వెంటనే స్పందించారు. ఆహార భద్రతా శాఖ అధికారులు టి. సునీత, జి. నవిత పట్టణంలోని పలు దుకాణాలను తనిఖీ చేసి అనుమానాస్పదంగా ఉన్న ఆహార పదార్థాల శాంపిల్స్ సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినియోగదారుల ప్రాణాలతో చెలగాటం ఆడే విధంగా నాణ్యత లేని, కాలం చెల్లిన పదార్థాలను విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. దుకాణదారులు ప్యాకెట్లపై ఉన్న తయారీ మరియు ఎక్స్‌పైరీ తేదీలను తప్పనిసరిగా గమనించాలని, నిబంధనలు ఉల్లంఘించే ఏజెన్సీలు, దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు కూడా అప్రమత్తంగా ఉండి, గడువు ముగిసిన వస్తువులను కొనుగోలు చేయవద్దని సూచించారు. ఈ తనిఖీల్లో వినియోగదారుల హక్కుల సంఘం ప్రతినిధులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# చింతల సాంగ్వీలోఘనంగా వివేకుని జయంతి.



**బజార్ హత్నూర్, జనవరి 12(డిడి9వార్త న్యూస్):-** బజార్ హత్నూర్ మండలంపరిధిలో గల చింతల సాంగ్వీ గ్రామంలో ఆదివాసీ యువజన సంఘం అధ్వర్యంలోసోమవారంరోజుస్వామివివేకానంద జయంతినిఘనంగాజరుపుకున్నారు .భారతదేశ ఔనత్యాన్ని విశ్వవ్యాప్తంచేసినచైతన్య మూర్తి ఐన స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాలవేసినివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ఆదివాసీయువజన సంఘం సభ్యులు, పలువురుగ్రామ ప్రజలుతదితరులుపాల్గొన్నారు.

# బషీరాబాద్ ఐటిఐలో అప్రెంటీస్ మేళా విజయవంతం




**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :** కమ్మర్‌పల్లి మండలంలోని బషీరాబాద్ ప్రభుత్వ ఐటిఐలో సోమవారం నిర్వహించిన అప్రెంటీస్ మేళాకు విశేష స్పందన లభించింది. విద్యార్థులకు ఉపాధి మార్గాలు చూపే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొని ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసుకున్నాయి. ఉద్యోగాలకు ఎంపిక: ఈ ఇంటర్వ్యూలకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌కు చెందిన ప్రముఖ మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఐటిఐ పూర్తి చేసిన అభ్యర్థుల నైపుణ్యాలను పరిశీలించి, అందులో 10 మంది విద్యార్థులను అప్రెంటీస్ మరియు ఉద్యోగాల కోసం ఎంపిక చేశారు. అదేవిధంగా టాటా స్టైవ్ (మెట్‌పల్లి) ప్రతినిధులు కూడా హాజరై విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాల గురించి వివరించారు. నైపుణ్యంతోనే ఉజ్వల భవిష్యత్తు: ఈ సందర్భంగా ఐటిఐ ప్రిన్సిపాల్ యం. కోటిరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే ఉపాధి వాటంతట అవే వస్తాయని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందిస్తూ, కంపెనీలు కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ జి. శ్రీనివాస్, ఏటీఓ జి. శాన్యోరా, జూనియర్ అసిస్టెంట్ వి. శివ కుమార్ మరియు ఐటిఐ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

# చక్రేశ్వర ఆలయ అలంకరణకు టెండర్లు ఖరారు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**
మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బోధన్ పట్టణంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ చక్రేశ్వర శివాలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు, ఆలయ అలంకరణ పనులకు సంబంధించి దేవాదాయ శాఖ కసరత్తు పూర్తి చేసింది. సోమవారం ఆలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కమల ఆధ్వర్యంలో టెండర్లను తెరిచి (ఓపెన్ టెండర్లు) ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కమల మాట్లాడుతూ.. శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయానికి పోటెత్తే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయానికి రంగులు వేయడం, విద్యుద్దీకరణ, పూల అలంకరణ, సౌండ్ సిస్టమ్ మరియు భక్తుల క్యూలైన్ల కోసం బారికేడ్ల ఏర్పాటుకు గాను రూ. 2,70,116 లకు టెండర్ ఖరారైనట్లు ఆమె వెల్లడించారు. ముందుగా సీల్డ్ కవర్ల ద్వారా స్వీకరించిన టెండర్లను అందరి సమక్షంలో తెరిచి, నిబంధనల ప్రకారం కాంట్రాక్టును అప్పగించినట్లు పేర్కొన్నారు. శివరాత్రి నాటికి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, అర్చకులు దేవాదాయ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# అరైవ్ అలైవ్ తోనే సురక్షిత ప్రయాణం : సీపీ సాయి చైతన్య




**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**
రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి ఏటా ఎన్నో కుటుంబాలు వీధిన పడుతున్నాయని, ఈ ప్రమాదాలను అరికట్టి ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా పోలీస్ శాఖ అరైవ్ అలైవ్ డిఫెన్సివ్ డ్రైవింగ్ కార్యక్రమాలను చేపట్టిందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలిపారు. రాష్ట్ర డి.జి.పి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ మాట్లాడుతూ.. నిజామా బాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలో రోడ్డు ప్రమాదాల ప్రభావాన్ని తగ్గించడానికి ఈ వినూత్న కార్యక్రమాన్ని రూపొందించినట్లు చెప్పారు. వాహన చోదకులు తమ గమ్యస్థానాలకు సురక్షితంగా చేరడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ సందర్భంగా వివరించారు. హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే అనర్థాలపై హెచ్చరికలు. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్లు వాడకూడదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచన. రహదారులపై నడిచే వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం. రానున్న రోజుల్లో అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, గ్రామాల్లోని ప్రధాన జంక్షన్లలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. డ్రైవర్ల ఆలోచనా దృక్పథంలో మార్పు తెచ్చి, రోడ్డు క్రమశిక్షణను అలవాటు చేయడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని సీపీ స్పష్టం చేశారు. ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు.

# ఆర్మూర్ మున్సిపాలిటీ తుది ఓటరు జాబితా విడుదల



**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :** ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలోని 36 వార్డులకు సంబంధించిన తుది ఓటరు జాబితాను సోమవారం మున్సిపల్ కమిషనర్ శ్రావణి అధికారికంగా విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పూర్తి చేసి, తుది నివేదికను ప్రజల సందర్శనార్థం అందుబాటులో ఉంచినట్లు ఆమె తెలిపారు. ఓటర్లు తమ పేరు, వార్డు వివరాలు, పోలింగ్ స్టేషన్ వివరాలను మున్సిపల్, సబ్ కలెక్టర్, తహశీల్దార్ కార్యాలయాల్లో ప్రదర్శించిన జాబితాలో చూసుకోవచ్చని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రావణి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన పౌరులందరూ సంబంధిత కార్యాలయాలను సందర్శించి, జాబితాలో తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, ఈ అవకాశాన్ని ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# భీంగల్ టీఎన్జీవో యూనిట్ క్యాలెండర్ ఆవిష్కరణ




**నిజామాబాద్ జిల్లా జనవరి 12(డీడీ9 వార్త) :**
టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ నాశెట్టి సుమన్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం భీంగల్ యూనిట్ నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. భీంగల్ యూనిట్ అధ్యక్షులు సృజన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, తహసీల్దార్ శ్రీ షబ్బీర్ ముఖ్య అతిథులుగా పాల్గొని క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. యూనిట్ కార్యవర్గ బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం, వారి హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న టీఎన్జీవో భీంగల్ యూనిట్ నాయకత్వాన్ని వారు అభినందించారు. ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తూనే, తమ సమస్యలను యూనిట్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భీంగల్ యూనిట్ సహాధ్యక్షులు కుంట శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పురస్తు నరేష్, ఎడెల్లి రవి, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, రాకేష్ మరియు ఇతర ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కథ చిన్నదే అయినా..కథనం అద్భుతం

## ప్రేక్షకులను సరదా పట్టించిన మనశంకర వరప్రసాద్

సాధారణంగా చిరంజీవి సినిమా అంటే .ఓష్...దానికి తోడు ప్రత్యేక పాత్రలో వెంకటేశ్ తోడయ్యాడు. ఇంకేముందీ.. అంచనాలు అంబరాన్ని తాకాయి. విడుదలైన ప్రచార చిత్రాలన్నీ సినిమాపై అంచనాలను రెట్టింపు చేశాయి. ఇక హిట్ మిషిన్ అనిల్ రావిపూడి ఈ సినిమాకు దర్శకుడు కావడంతో విజయం తథ్యం అని జనాలంతా ఫిక్సయిపోయారు. ఇంతటి పాజిటివ్ వాతావరణం మధ్య ఎట్టకేలకు సోమవారం 'మన శంకర వరప్రసాద్‌గారు' సంక్రాంతికి వచ్చేశారు. కథలోకి వెళితే... కేంద్రమంత్రి శర్మ(శరత్ సక్సేనా)కు 'నిన్ను చంపేస్తున్నాం' అంటూ ఓ హంతకుల గ్యాంగ్ నుంచి బెదిరింపు కాల్ రావడం.. ఆయన దగ్గర పనిచేస్తున్న నేషనల్ సెక్యూరిటీ ఆఫీసర్ శంకర్‌వరప్రసాద్(చిరంజీవి) ఆ గ్యాంగ్‌ని తుదముట్టించడంతో కథ మొదలవుతుంది. శంకర్‌వరప్రసాద్‌ని శర్మ తన కుటుంబ సభ్యుడిగా చూసుకుంటూ ఉంటాడు. ఎప్పుడూ సరదాగా ఉండే శంకరప్రసాద్ మనసులో ఏదో బాధ ఉన్నదని గ్రహించిన శర్మ.. ఓ రోజు శంకరప్రసాద్‌ని కారణం అడగుతాడు. భార్యతో విడిపోవడం.. కన్నబిడ్డలకు దూరం కావడం.. ఇవే శంకర వరప్రసాద్ బాధకు కారణాలని శర్మకు అర్థమవుతుంది. అందుకే ఓ బోర్డింగ్ స్కూల్‌లో చదువుకుంటున్న పిల్లల్ని కలుసుకునే ఏర్పాటు చేస్తాడు శర్మ. ఆ స్కూల్‌లో పీఈటీగా జాయిన్ అయిన శంకర వరప్రసాద్.. తన పిల్లలకు ఎలా చేరువయ్యాడు? అసలు శంకరప్రసాద్ భార్యతో విడిపోవడానికి కారణం ఏంటి? చివరకు ఆ కుటుంబం ఎలా కలిసింది? అనే ప్రశ్నలకు సమాధానమే మిగతా కథకథగా చెప్పుకుంటే పెద్దగా కథేం కాదు. కానీ ఉన్న కథను క్యూట్‌గా.. ఎక్కడా అనవసరపు పాత్రలు కానీ, సన్నివేశాలు



కానీ లేకుండా అర్థవంతంగా నడిపాడు దర్శకుడు అనిల్ రావిపూడి. సాధారణంగా ఇలాంటి కథలకు లాజిక్కులు వెతక్కూడదు. ఈ సినిమాలో కూడా కొన్ని లాజిక్ లేని విషయాలున్నా అవి ఆడియన్స్‌ని అంతగా ఇబ్బంది పెట్టవ్. అపార్థం చేసుకొని విడిపోయిన భార్యకు తానేంటో అర్థం కావాలని తపించే భర్త కథ ఇది. దూరమైన బిడ్డలను అక్కున చేర్చుకోవాలని తహతహలాగే ఓ తండ్రి కథ ఇది. ఈ కథ చుట్టూ వినోదాన్ని మేళవించి జనరంజకంగా మలిచాడు దర్శకుడు అనిల్ రావిపూడి. ప్రధాన పాత్రల మధ్య ఏర్పాడే ఆయా పరిస్థితుల నుంచి పుట్టే కామెడీనే ఈ సినిమాలో ఆద్యంతం కనిపిస్తుంది. సిట్యువేషనల్ కామెడీ కావడంతో సినిమా ఎక్కడా విసుగు రాలేదు. ప్రథమార్థం పాత్రల పరిచయాలు, హీరోహీరోయిన్లు కలవడం, విడిపోవడం, దానికి సంబంధించిన పరిస్థితుల నేపథ్యంలో సాగింది. సమస్యలు సీరియస్‌వే అయినా.. చెప్పడం మాత్రం వినోదంగా చెప్పాడు. ఈ కథలో విలన్ పాత్ర గురించి ప్రత్యేకించి చెప్పాలి. చిరంజీవి సినిమాల్లో విలన్ అంటే అత్యంత శక్తిమంతుడిగా, ప్రమాదకారిగా కనిపిస్తాడు. కానీ ఈ సినిమాలో ప్రధాన విలన్ ఓ కామన్ మ్యాన్ కావడం విశేషం. అతను విలన్‌గా మారే పరిస్థితులు కూడా లాజికల్‌గానే అనిపిస్తాయి. అసలు విలన్ కామన్ మ్యాన్ అవ్వడం వల్లే ఈ కథలో ఆసక్తి ఇంకాస్త పెరిగిందనాలి. ద్వితీయార్థం కొంతభాగం కాస్త సీరియస్ వేలో సాగినా.. చివరి 20 నిమిషాలు వెంకటేశ్ ఎంట్రీతో సినిమా మళ్లీ వినోదంవైపు టర్న్ తీసుకున్నది. వెంకీగౌడాగా తెరపై వెంకటేశ్ చేసిన సందడి అంతా ఇంతా కాదు. ఓ విధంగా ఆయన ఉన్నంతవరకూ తెరపై అందర్నీ డామినేట్ చేశారు. తెరపై చిరంజీవి, వెంకటేశ్ ఒకే ఫ్రేమ్‌లో సందడి చేయడం.. అభిమానులకే కాదు, సగటు ప్రేక్షకుడికి కూడా కన్నుల పండుగ అనిపించింది. శంకరవరప్రసాద్‌గా చిరంజీవి అభినయం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. ఇలాంటి పాత్రలు ఆయన కేక్‌వాక్. ఎప్పటిలాగే తనదైన యాక్షన్, కామెడీ, ఎమోషన్స్‌తో ఆడియన్స్‌ని అలరించారు చిరంజీవి. సరదాగా ఉన్నప్పుడు 'చంటాబ్బాయి'ని గుర్తు చేస్తూ.. అవసరమైనప్పుడు రౌడీ అల్లుడ్నీ, ఘరనామొగుడ్నీ యాదికి తెస్తూ.. పాటల్లో 'కొండవీటి దొంగ'ను.. యాక్షన్‌లో 'గ్యాంగ్ లీడర్'ని గుర్తు చేస్తూ వింటేజ్ మెగాస్టార్ తెరపై సాక్షాత్కరించారని చెప్పక తప్పదు. ఇక ఇందులో చిరంజీవికి సమానమైన పాత్ర నయనతారది. ఆ పాత్రలో ఉండే దర్పం, అభిజాత్యాన్ని అద్భుతంగా పలికించింది నయనతార. ఆమె చేయడం వల్ల ఆ పాత్రకు నిండుదనం వచ్చిందని చెప్పొచ్చు. ఇక సచిన్ ఖేడేకర్‌ది ఇందులో కీలకమైన పాత్ర. ఎప్పటిలాగే తనదైన అభినయంతో ఆయన ఆకట్టుకున్నారు. మిగతా నటీనటులంతా తమదైన పాత్రలకు పూర్తి న్యాయం చేశారు. ఇక చివరిగా వెంకటేశ్ చివరి 20 నిమిషాలు ఆయన సినిమాలో కనిపిస్తారు. అప్పటివరకూ ఓ స్థాయిలో నడిచిన సినిమాను తన రాకతో పరుగులు పెట్టించాడు వెంకటేశ్. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్ నిజంగా సూపర్బ్. చిరంజీవి, వెంకటేశ్ పాత్రల్నీ ఆయన ట్యాకిల్ చేసిన తీరు మాత్రం నిజంగా అభినందనీయం. ఇక ఈ సినిమా ప్రధాన బలాల్లో భీమ్స్ సంగీతం ఒకటి. ప్రతి పాటా జనాలకు నచ్చింది. నేపథ్య సంగీతం కూడా ఆకట్టుకునేలా ఉంది. సమొత్తంగా ఆద్యంతం తనదైన కామెడీతో గిలిగింతలు పెడుతూ.. అక్కడక్కడ ఎమోషన్స్‌తో మనసుల్ని గిల్లుతూ, అవసరమైన చోటా మెగాస్టార్ గ్రేస్‌ని నేటి తరానికి పరిచయం చేస్తూ, అభిమానులకు వింటేజ్ మెగాస్టార్‌ని గుర్తు చేస్తూ.. అద్భుతంగా సినిమాను మలిచాడు దర్శకుడు అనిల్ రావిపూడి.



## నిఖిల్ స్వయంభుపై పెరుగుతున్న అంచనాలు

విడుదలకు సిద్ధంగా ఉన్న పాన్ ఇండియా చిత్రాలో 'స్వయంభు' ఒకటి. యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ నటిస్తున్న ఈ అత్యంత ప్రతిష్టాత్మక చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తుండగా,సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమాకు ఠాగూర్ మధు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. కాగా ఈ చిత్రం ఫిబ్రవరి 13, 2026న ప్రపంచవ్యాప్తంగా పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుంది. అయితే తాజాగా ఈ మూవీ గురించి ఇంట్రెస్టింగ్ న్యూస్ వైరల్ అవుతుంది.పిరియాడికల్ మైథలాజికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఇంటర్వల్ సీక్వెన్స్ హైలైట్ కాబోతోందట. ఈ సీన్‌లో నిఖిల్ ఇతర ప్రధాన పాత్రల మధ్య వచ్చే యాక్షన్ విజువల్స్ చాలా వైల్డ్ గా, రా గా ఉంటాయని సమాచారం. ముఖ్యంగా ఈ యాక్షన్ సీక్వెన్స్‌లో నిఖిల్ గెటప్, యుద్ధ సన్నివేశాల సెటప్ ప్రేక్షకులను థ్రిల్ కి గురిచేస్తాయని ఇన్సైడ్ టాక్. 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతం, సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ ఈ సీన్స్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లనున్నాయట. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేయగా, ఈ లేటెస్ట్ యాక్షన్ అప్‌డేట్ నిఖిల్ అభిమానుల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతోంది.

-------------

## సంక్రాంతికి రొమాంటిక్ టచ్ ఇస్తున్న రవితేజ!

రవితేజ తన సినిమాల విషయంలో ఎంత మాత్రం గ్యాప్ రానీయడు. అనుకోకుండా ఒక్కోసారి లెక్క తప్పడం వలన, ప్రాజెక్టులు ఆలస్యమవుతూ ఉంటాయే తప్ప, తానుగా ఆలస్యం చేయడమనేది తనకి ఎంతమాత్రం అలవాటు లేని పని. నాన్చడం ఆయనకి ఎంత మాత్రం ఇష్టం ఉండదు. అందువల్లనే ఆయన నుంచి చకచకా సినిమాలు వచ్చేస్తూ ఉంటాయి. అలా ఈ సంక్రాంతికి వస్తున్న సినిమానే 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా, ఈ నెల 13వ తేదీన విడుదల కానుంది. రవితేజ కథనాయకుడిగా నటించిన ఈ సినిమాలో, కథనాయికలుగా ఆషికా రంగనాథ్ – డింపుల్ హయతి అలరించనున్నారు. ఈ ఇద్దరితో కలిసి




రవితేజ చేసే రొమాన్స్, ఫ్యామిలీ ఆడియన్స్ కి నచ్చేలా కామెడీ టచ్ తో నడుస్తుందని అంటున్నారు. డింపుల్ కి ఉన్న హాట్ ఇమేజ్ .. ఆషికకి గల ఫాలోయింగ్ ఈ సినిమాకి ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్ ల ద్వారా మంచి మార్కులు కొట్టేసిన కిశోర్ తిరుమల ఈ సినిమాకి దర్శకత్వం వహించడం విశేషం. 'నా సామిరంగ' సినిమాలో నాగార్జున సరసన గ్లామర్ పరంగా సందడి చేసిన ఆషికా రంగనాథ్ ఆ తరువాత చేసిన సినిమా ఇది. భార్యకీ .. ప్రియురాలికి మధ్యలో నలిగిపోయే పాత్రలో రవితేజ నటన, అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుందని అంటున్నారు. సంక్రాంతి సినిమా నుంచి ప్రేక్షకులు కోరుకునే అన్ని రకాల అంశాలు ఈ సినిమాలో ఉంటాయని చెబుతున్నారు. చూడాలి మరి ఈ సంక్రాంతి బరిలో ఈ సినిమా ఏ స్థాయిలో సందడి చేస్తుందో.




## ఆ పాత్రకు ఒక మొండితనం ఉంది...

### : శోభిత ధూళిపాళ్ల

ప్రముఖ నటి శోభితా ధూళిపాళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా క్రైమ్ సస్పెన్స్ డ్రామా 'చీకటిలో'. ఈ చిత్రంలో ఆమె సంధ్య అనే పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా త్వరలో అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానున్న నేపథ్యంలో, శోభిత తన పాత్ర గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సంధ్య పాత్రలో నటించడం ఒక అద్భుతమైన అనుభవం అని ఆమె పేర్కొన్నారు.తన పాత్ర గురించి వివరిస్తూ, "ఆమె ఒక ముక్కుసూటి అమ్మాయి. స్వతంత్రంగా ఆలోచిస్తుంది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తన నమ్మకాలకు కట్టుబడి ఉంటుంది. ఆమె నిర్ణయాల వెనుక ఒక ప్రత్యేకమైన మొండితనం, దానికి ఒక చరిత్ర కూడా ఉంది" అని శోభిత తెలిపారు. హైదరాబాద్ వీధులు, ఇతర తెలుగు ప్రాంతాల సాంస్కృతిక నేపథ్యం ఉన్న పాత్ర కావడం వల్ల, అందులో సులభంగా ఒదిగిపోగలిగానని ఆమె చెప్పారు."ప్రైమ్ ఒరిజినల్ ప్రాజెక్ట్‌లో భాగం కావడం ఎంతో ప్రత్యేకమైనది. 'మేడ్ ఇన్ హెవెన్' నుంచి 'చీకటిలో' వరకు నా ప్రయాణం స్ఫూర్తిదాయకంగా సాగింది. జనవరి 23న ప్రైమ్ వీడియోలో సినిమా విడుదలయ్యాక, సంధ్యగా నాలోని మరో కోణాన్ని ప్రేక్షకులు చూస్తారు" అని శోభిత ఆశాభావం వ్యక్తం చేశారు.హైదరాబాద్ నేపథ్యంలో సాగే ఈ కథలో, నిజాలను వెలికితీసే క్రమంలో సంధ్య అనే ట్రూ క్రైమ్ పాడ్‌కాస్టర్ నగరంలోని కొన్ని చీకటి రహస్యాలను ఎలా ఎదుర్కొందనేది చూపిస్తారు. ఈ చిత్రంలో విశ్వదేవ్ రాచకొండ హీరోగా నటించగా, చైతన్య విశాలాక్షి, ఈషా చావ్లా, ఝాన్సీ, ఆమని, వడ్లమాని శ్రీనివాస్ కీలక పాత్రలు పోషించారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించిన ఈ థ్రిల్లర్‌ను సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై డి. సురేష్ బాబు నిర్మించారు. ఈ చిత్రం జనవరి 23 నుంచి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది.

## సుప్రీంను ఆశ్రయించిన జననాయగన్

'జన నాయగన్'కు మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్ స్టే విధించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ 'జన నాయగన్' టీమ్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ చేపట్టాలని కోరుతూ నేడు పిటిషన్ వేసింది. ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ ఇవ్వాలని సెన్సార్ బోర్డును మద్రాసు హైకోర్టు సింగిల్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది. అయితే, సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సీబీఎఫ్‌సీ మద్రాసు హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా.. విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. సెన్సార్ సర్టిఫికెట్ జారీపై తాత్కాలిక స్టే విధించింది. తదుపరి విచారణను జనవరి 21వ తేదీకి వాయిదా వేసింది. ఇప్పుడీ స్టే పై చిత్రబృందం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.



## రాజాసాబ్ మూడ్రోజుల వసూళ్ళు 183 కోట్ల గ్రాస్

మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన 'ది రాజాసాబ్' సినిమా సోషియో ఫాంటసీ డ్రామాగా రూపొందింది. మైండ్ గేమ్ ఛాలెంజింగ్‌గా వచ్చిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లో సందడి చేస్తోంది. నైజాం ప్రీమియర్స్ పరంగా కాస్త దెబ్బ పడిన ఓవరాల్ మాత్రం సాలిడ్ స్టార్టప్ అందుకుంది రాజాసాబ్. మొదటి రోజు ప్రపంచ వ్యాప్తంగా రూ. 112 కోట్లు గ్రాస్ వసూలు చేసింది. దీంతో.. ప్రభాస్ కెరీర్లో వంద కోట్ల ఓపెనింగ్స్ రాబట్టిన 6వ సినిమాగా రాజాసాబ్ రికార్డ్ నమోదు చేసింది. మిక్స్ టాక్ వచ్చిన సరే ఎక్కడా తగ్గకుండా దూసుకెళ్తున్నాడు రాజాసాబ్. ఇక ఈ సినిమా ఫస్ట్ వీక్ రన్ ఫినిష్ చేసుకుంది. రిలీజ్ అయిన మూడు రోజులకు గాను రూ. 183 కోట్ల గ్రాస్ రాబట్టి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఇక నేటి నుండి వరుస సెలవలు కావడంతో బుకింగ్స్ లో జోరు చూపిస్తూ ఈ రోజు ముగిసేనాటికి రూ. 200 కోట్ల మార్క్ అందుకుంటుందనీ ట్రేడ్ అంచనా వేస్తుంది.

